వలంటీర్ల సేవలు అద్భుతం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తున్న వలంటీర్ల సేవలు అద్భుతమని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కొనియాడారు. నగరంలోని ఎఫ్‌సీఐ కాలనీ, సాయిబాబా మందిరం వద్ద తొమ్మిదో డివిజన్‌కు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించిన ఎమ్మెల్యే మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందజేస్తున్నారని వివరించారు. డివిజన్‌కు సంబంధించి 19 వేలకుపైగా ధ్రువీకరణ పత్రాలను అందజేశామని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందిస్తున్నామని తెలిపారు. వలంటీర్లు అవసరమని ప్రజలే కోరుతున్నారని, దీని బట్టి వలంటీర్ల వ్యవస్థ ఎంత అద్భుతంగా పనిచేస్తోందో అర్థమవుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదో డివిజన్లో రూ.మూడు కోట్లకు మించి పథకాలు రాలేదని, అయితే తమ ప్రభుత్వంలో రూ.25 కోట్ల మేర లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామని వెల్లడించారు. గత ఎన్నికల అనంతరం టీడీపీ నేత నారాయణ పత్తా లేకుండా పోయారని, ఇలాంటి వ్యక్తి ప్రజలకు ఏమి చేస్తారని ప్రశ్నించారు. కమిషనర్ వికాస్ మర్మత్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రథమ ప్రాధాన్యం


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విద్యకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమిస్తోందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 53వ డివిజన్లోని వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాలలో 30 కంప్యూటర్లతో కూడిన ఐటీ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధి, విద్యకు దాదాపు రూ.65 వేల కోట్లను ప్రభుత్వం వెచ్చించిందని చెప్పారు. కార్పొరేటర్లు దేవరకొండ సుజాత, సఫియాబేగం, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

వేగా జ్యువెలరీ ప్రదర్శన ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో వేగా జ్యువెలర్స్ ప్రదర్శనను గురువారం ప్రారంభించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆర్యవైశ్య మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ మాట్లాడారు. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో బంగారు, వజ్రాభరణాల షోరూమ్‌లను నిర్వహిస్తున్న వేగా జ్యువెలర్స్ నెల్లూరులో రెండు రోజుల పాటు ప్రదర్శనను నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడారు. పోల్కీ జ్యువెలరీపై ఎలాంటి మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవని చెప్పారు. విజయవాడలోని షోరూమ్‌లో శుక్రవారం నిర్వహించనున్న లక్కీడ్రాలో మూడు డైమండ్ నెక్లెస్‌లను గెలుపొందే అవకాశం ఉందన్నారు. ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఎన్నో రకాల బంగారు, వజ్రాభరణాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు. తమ షోరూమ్‌లను తెలుగు రాష్ట్రాల్లోని మరిన్ని నగరాలకు విస్తరించే ప్రతిపాదన ఉందని చెప్పారు. ప్రదర్శన, అమ్మకాలు శుక్రవారం ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

జగనన్న సురక్షతో లబ్ధి

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: జగనన్న సురక్షతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. మాదరాజుగూడూరులోని సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా నెల పాటు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. అనంతరం విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. అనంతరం పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆర్డీఓ మలోల, రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ గోపీ, వైస్ ఎంపీపీ రవీంద్రరెడ్డి, సర్పంచ్ చిట్టిబోయిన వెంకటేశ్వర్లు, నేతలు హరిబాబుయాదవ్, వెంకటేశ్వర్లురెడ్డి, వీరరాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32, 33వ డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి హాజరయ్యారు. 32వ డివిజన్ కార్పొరేటర్ అవినాష్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు ఆసిఫ్, రెహ్మాన్, మదన్‌మోహన్‌రెడ్డి, మేఘనాథ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల సంతోషం


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఏడో డివిజన్లో గల జాఫర్‌సాహెబ్ కాలువ గట్టు, వెంగమాంబ వీధి, జయప్రకాష్ వీధి, తదితర ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం.. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరుతున్నారని చెప్పారు. కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు (టౌన్): ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్నమయ్య సెంటర్‌లోని యూటీఎఫ్ భవనంలో ఎస్‌ఎఫ్‌ఐ 43వ ప్లీనరీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా హర్ష, శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా బాలాజీకిరణ్, సంతోష్‌ను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా నరేంద్ర, అశ్విన్, సూర్య, జిల్లా కమిటీ సభ్యులుగా సుకుమార్, ఉదయ్, కిరణ్, పవన్, వినయ్, ప్రియా, సుమన్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ వైద్యుడు కాలేషాబాషా, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

నెల్లూరు(బారకాసు): ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఓటర్ల జాబితా సవరణపై నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు శుక్రవారం నుంచి ఇంటింటికీ తిరిగి ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులు.. చేర్పులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించనున్నారని చెప్పారు. తహసీల్దార్ నిర్మలానందబాబా, డీసీపీ దేవీకుమారి, ఈడీటీ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

నెల్లూరు(బారకాసు): వర్షాకాల నేపథ్యంలో అన్ని డివిజన్లలోని డ్రెయిన్లలో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పారిశుధ్య సిబ్బందితో డీ సిల్టేషన్ పనులను నిర్వహించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. 22వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన చెత్త సేకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మూలె విజయభాస్కర్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో అనర్థాలు



నెల్లూరు(బారకాసు): పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని ఎన్‌సీడీ విభాగ వైద్యాధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నగరంలోని రామ్మూర్తినగర్, ఆత్మకూరు బస్టాండ్‌లోని దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను ఎన్‌సీడీ విభాగ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించొద్దని ఆదేశించారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే జరిమానాను విధిస్తామని స్పష్టం చేశారు. ఎన్టీసీపీ సోషల్ వర్కర్ హసిని, ఫుడ్ సేఫ్టీ అధికారి నీరజ, ఎన్‌సీడీ విభాగ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ కృష్ణవేణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పెడచెవిన



మొబైల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలను నడపడం ప్రమాదకరమని పోలీస్, రవాణా అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నా, పలువురు పెడచెవిన పెడుతున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ వారు ప్రమాదాలకు గురికావడమే కాకుండా ఇతరులు ప్రమాదాల బారిన పడేందుకు కారణమవుతున్నారు. నగరంలో పలువురు మహిళలు ఇలా ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ గురువారం కనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





క్లుప్తంగా

ఆర్చరీ పోటీల్లో 'రెయిన్‌బో' విద్యార్థి ప్రతిభ



నెల్లూరు రూరల్: శ్రీలంకలోని కొలంబోలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో కలివెలపాళెంలోని రెయిన్‌బో స్కూల్ ఆరో తరగతి విద్యార్థి పోలంరెడ్డి యశ్వంత్‌రెడ్డి అండర్ – 12 బాలుర విభాగంలో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. చోళన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఈ క్రమంలో విద్యార్థిని పాఠశాలలో గురువారం అభినందించిన అనంతరం స్కూల్ డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం మాట్లాడారు. శిక్షకులు విజయభరద్వాజ్, చాముండేశ్వరికి అభినందనలను తెలియజేశారు. ప్రిన్సిపల్ అరుణాస్వయంప్రభ, వైస్ ప్రిన్సిపల్స్ సురేఖారెడ్డి, పద్మజ, ఆర్చరీ సంఘ జిల్లా అధ్యక్షుడు హర్ష, కార్యదర్శి వేణు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించిన మూలాపేటలోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ విద్యార్థి చాట్ల అక్షయ్ మాధవ్‌ను ఇస్కాన్ సిటీలోని తన నివాసంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం అభినందించారు. శ్రీలంకలోని కొలంబోలో ఇటీవల నిర్వహించిన ఆర్చరీ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో 18 మీటర్ల పోటీల్లో సాధించిన స్వర్ణ పతకం, 30 మీటర్ల రికర్వ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం, సర్టిఫికెట్లను ఎమ్మెల్యేకు చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. చాట్ల నరసింహారావు, రాజేష్ పాల్గొన్నారు.

నల్లపాళెంలో భూముల రీ సర్వే పూర్తి

పొదలకూరు : మండలంలోని నల్లపాళెం గ్రామంలో భూముల రీసర్వే పూర్తయింది. తాటిపర్తి పంచాయతీలో ఉన్న నల్లపాళెం గ్రామాన్ని మూడో విడత భూముల రీసర్వేకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భూములను సర్వే చేశారు. గ్రామంలో మొత్తం 1,837.40 ఎకరాలు ఉండగా భూముల సర్వేను పూర్తి చేసి గ్రౌండ్ ట్రూతెనింగ్ చేస్తున్నారు. సర్వే పూర్తయిన భూముల వద్ద సంబంధిత రైతులను దగ్గర పెట్టుకుని గట్లు, హద్దులను ఏర్పాటు చేస్తున్నారు. తర్వాత సర్వేరాళ్లను నాటిస్తామని సర్వేయర్ వెల్లడించారు. నెల్లూరు ఆర్డీఓ మలోల నల్లపాళేనికి వచ్చి సర్వే వివరాలను తెలుసుకొని వెళ్లారు. సమగ్ర భూముల సర్వేను పూర్తి చేసి త్వరలో పాసుపుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ముత్తుకూరు : మండలంలోని నేలటూరు బీసీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రాత్రి ఓ పూరిల్లు దగ్ధమైంది. నల్లబాయి సుబ్రహ్మణ్యం దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని భార్యాభర్తలు భయంతో వెలుపలకు పరుగులు తీశారు. చెలరేగిన మంటలు పూర్తిగా వ్యాపించడంతో ఇల్లు కాలిపోయింది. గృహోపకరణాలు, దుస్తులు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నేత గురువారం బాధితులను పరామర్శించి, రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముత్తుకూరు : సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ డాక్టర్ నిర్మల అన్నారు. మండలంలోని ముసునూరువారిపాళెంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం జరిగింది. నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ సంస్థ సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యుడు గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

అంతరాయాల్లేని విద్యుత్‌ను అందించాలి

కొడవలూరు: అంతరాయాల్లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని ట్రాన్స్‌కో నిర్వహణ, సంరక్షణ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరంధామయ్య సూచించారు. మండలంలోని పద్మనాభసత్రం సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. తద్వారా అంతరాయాలను పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. సబ్‌స్టేషన్ నిర్వహణ బేషుగ్గా ఉందని తెలిపారు. ఏమైనా కారణాల వల్ల విద్యుత్ అంతరాయాలుంటే విధిగా ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సబ్‌స్టేషన్ నిర్వహణలో అలక్ష్యం ప్రదర్శిస్తే ఏఈ, షిఫ్ట్ ఆపరేటర్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈఈ వెంట ఏఈ ఎం.రాములు, విద్యుత్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ



నెల్లూరు (లీగల్): కృష్ణా జిల్లా మొవ్వ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుపై దుండగుల అమానుష దాడికి నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బహిష్కరించి నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ మాట్లాడారు. దుండగులను కఠినంగా శిక్షించడంతో పాటు అడ్వొకేట్ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రోజారెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, బార్ ఇన్‌చార్జి కార్యదర్శి అన్వర్‌బాషా, ట్రెజరర్ రమేష్ అబ్బయ్యరెడ్డి, నన్నే సాహెబ్, రాజేంద్రప్రసాద్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల ఎదుట ధర్నా



నెల్లూరు (టౌన్): ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేటలోని నారాయణ జూనియర్ కళాశాల ఎదుట ధర్నాను గురువారం చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాఖీ, నేతలు ప్రేమ్, రాజేష్, కార్తీక్, రహంతుల్లా, విశ్వంత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



నెల్లూరు(బారకాసు): అర్హులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. డివిజన్లోని 21 / 1, 2, 3, 4 సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎన్జీఓ కాలనీలో గురువారం నిర్వహించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కమిషనర్ వికాస్ మర్మత్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, కార్పొరేటర్ మూలె విజయభాస్కర్‌రెడ్డి, నేతలు రాజారెడ్డి, వెంకటరత్నం, సుబ్బారావు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల మంజూరుకు వినతిపత్రాన్ని సమర్పించారు.

వ్యాధుల నుంచి రక్షణకే మిషన్ ఇంద్రధనుష్



నెల్లూరు(బారకాసు): శిశువులు, పిల్లలు, గర్భిణులను వ్యాధుల నుంచి రక్షించేందుకు మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ రీజినల్ మేనేజర్ డాక్టర్ మేజర్ పేర్కొన్నారు. కార్యక్రమం అమలవుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గానూ కిసాన్‌నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను ఆరోగ్య సిబ్బంది వేశారాననే అంశాన్ని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వలసొచ్చే వారు, సంచార జాతుల వారిలో గర్భిణులు, చిన్నారులు టీకాలు వేయించుకున్నారాననే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీల్లో టీకాలను వేయాలని సూచించారు. డాక్టర్ బోరా, డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ముగించారు..



• గైనకాలజిస్ట్ లేకుండానే స్టాఫ్ నర్సులకు శిక్షణ

నెల్లూరు(బారకాసు): ప్రసవ సమయంలో ఎలాంటి ప్రాథమిక సేవలందించాలనే అంశంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని పలు పీహెచ్‌సీల్లో నూతనంగా నియమితులైన 24 మంది స్టాఫ్‌నర్సులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తవానికి గైనకాలజిస్ట్, పీడియాట్రిక్ వైద్యులతో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, చిన్నపిల్లల వైద్య నిపుణులతో నిర్వహించి ముగించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు అంశాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, అదీ జరగలేదు. శిక్షణ నిర్వహణకు ప్రభుత్వం రూ.1.74 లక్షలను విడుదల చేసింది. మంచి ఏసీ హాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు పలు అంశాలపై మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే ఇవేవీ పాటించకుండానే సరైన సదుపాయాల్లేని మహిళా ప్రాంగణంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఎలాంటి వసతినీ కల్పించకపోగా, మంచి పౌష్టికాహారాన్ని సైతం అందించలేదు. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో 25 శాతాన్ని కూడా ఖర్చు చేయకుండా శిక్షణను ముగించారు. దీని బట్టి నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విషయమై డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను సంప్రదించగా, తాను బిజీగా ఉండి శిక్షణ తీరును పరిశీలించలేదని చెప్పారు. గైనకాలజిస్ట్ లేకుండానే శిక్షణ కార్యక్రమాన్ని ముగించారనే విషయం తనకు తెలియదని, ఇక నుంచి ఇలా జరగకుండా చూస్తానని బదులిచ్చారు.

మెగా రక్తదాన శిబిరం



నెల్లూరు(బారకాసు): రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి పేర్కొన్నారు. అనిల్ డయాబెటిస్ సెంటర్ అధినేత డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ రక్తనిధిలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. దాదాపు 200 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయసింహ, మోటివేటర్లు మధుసూదన్‌రావు, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో గల డీఎస్‌నగర్ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో మైలు, కస్తూరినగర్, వీఆర్ కాలనీ, కిసాన్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 10.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల నీలగిరి సంఘం, కలెక్టర్ బంగ్లా, ఎన్నెమ్మీస్ ఫీడర్లలో స్కాడా పనులను చేపట్టనున్న నేపథ్యంలో లక్ష్మీనరసింహపురం, బారాషహీద్ దర్గా, కలెక్టర్ బంగ్లా, జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంతం, జెడ్పీ, కార్పొరేషన్ కార్యాలయాలు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఈఈ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

• నారాయణరెడ్డిపేట సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా నారాయణరెడ్డిపేట, కొత్తకాలువ, నాలుగో మైలు, నవలాకులతోట, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ శ్రీలక్ష్మి తెలిపారు.